సాక్షి
నంద్యాల
గురువారం । 23 । నవంబర్ । 2023



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల కొన సాగుతోంది. బుధవారం 1,930 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.



నిత్యాన్నదానానికి విరాళాలు

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి మాన్యం జిల్లాకు చెందిన ఎం.పద్మలత రూ.1,00,521, హైదరాబాద్‌కు చెందిన సీవీఎస్ సుబ్రహ్మణ్యం రూ.1,01,000 విరాళమిచ్చారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: కార్తీకమాసోత్సవాల సందర్భంగా బుధవారం శ్రీశైలంలో చెన్నైకి చెందిన గీతా గణేషన్ బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం అలరించింది.

న్యూస్‌రీల్

నంద్యాల మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలు

- ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి

బొమ్మలసత్రం: అయ్యప్ప భక్తుల కోసం నంద్యాల మీదుగా శబరిమలకు రైల్వే శాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును నడుపుతోందని ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైలు నంబర్ 07139 (విజయవాడ-కొట్టాయం) డిసెంబర్ 15, డిసెంబర్ 22, జనవరి 5 తేదీలలో విజయవాడ నుంచి సాయంత్రం 04:25 గంటలకు బయలుదేరి నంద్యాలకు రాత్రి 11:10 గంటలకు చేరుకుంటుందన్నారు. రైలు నంబర్ 07140 (కొట్టాయం-విజయవాడ) డిసెంబర్ 17, డిసెంబర్ 24, జనవరి 7 తేదీల్లో కొట్టాయం నుండి అర్ధరాత్రి 01:00 గంటకు బయలుదేరి, నంద్యాలకు రాత్రి 08:30 గంటలకు చేరుకుంటుందన్నారు. మొత్తం 21 బోగీలతో ఈ రైలు నడవనున్నదని, నంద్యాల, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, ఎర్నాకులం టౌన్ రైల్వేస్టేషన్లలో ఆగనున్నదని, అయ్యప్ప స్వామి దీక్షాదారులందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

శ్రీశైలం డ్యాంలో 62 టీఎంసీల నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 62.0510 టీఎంసీల నీరు నిల్వగా ఉంది. డ్యాం నీటి మట్టం 849.10 అడుగులకు చేరుకుంది. కొద్దిరోజులుగా జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోయిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి బుధవారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 6,570 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 1.067 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 2,224 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 1,105 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735 క్యూసెక్కు నీటిని విడుదల చేశారు.

పర్యాటక ప్రాంతాల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సెంట్రల్): జిల్లాలో ఉత్తమ పర్యాటక ప్రాంతాల(గ్రామాల) ఎంపికకు గానూ 2024 ఏడాదికి పర్యాటక మంత్రిత్వశాఖ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి సీహెచ్ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, వారసత్వ, కళాఖండాలు తదితర విశేషాలు ఉన్న గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన గ్రామాలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 7995087089 నంబరును సంప్రదించాలన్నారు.



బస్సు యాత్రలో డిప్యూటీ సీఎంలు అంజాద్‌బాషా, నారాయణ స్వామి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు



బహిరంగ సభకు భారీగా హాజరైన ప్రజలు

సాధికార ఉత్సాహం.. సామాజిక ఉత్తేజం

- జన జాతరను తలపించిన బనగానపల్లె
- విజయవంతమైన సామాజిక సాధికార యాత్ర
- బైక్ ర్యాలీతో నేతలకు స్వాగతం పలికిన కార్యకర్తలు
- ఆకట్టుకున్న ప్రజాప్రతినిధుల ప్రసంగాలు

భారీగా తరలివచ్చిన ప్రజలు.. కిక్కిరిసిన పుర వీధులు.. మార్మోగిన జగన్ నినాదాలు.. బుధవారం బనగానపల్లె పట్టణంలో సామాజిక సాధికార యాత్ర ఉత్సాహంగా సాగింది. మంత్రులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలు ఉత్తేజాన్ని నింపాయి. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక వైపు.. అందరినీ మోసం చేసే తెలుగుదేశం పార్టీ ఇంకో వైపు.. ప్రజలు ఏ వైపు ఉండాలో తేల్చుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు సూచించారు. మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు.

సాక్షి,నంద్యాల/కోవెలకుంట్ల/బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర బుధవారం బనగానపల్లె పట్టణంలో విజయవంతమైంది. నియోజకవర్గంలోని కోవెలకుంట్ల, బనగానపల్లె, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల నుంచి భారీ ఎత్తున ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తరలి రావడంతో పట్టణం జనసంద్రమైంది. సామాజిక బస్సు యాత్రకు డిప్యూటీ సీఎంలు అంజాద్‌బాషా, నారాయణస్వామి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మధుసూదన్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన సభ కొనసాగింది. ముందుగా పట్టణ శివారులోని ధనలక్ష్మి ఫంక్షన్‌హాలు వద్ద మంత్రులకు పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి ఘన స్వాగతం లభించింది.

సామాజిక యాత్ర సాగిందిలా..

ధనలక్ష్మి ఫంక్షన్‌హాలులో మధ్యాహ్నం 1.15 గంటల నుంచి 2.20 గంటల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో చర్చావేదిక జరిగింది. నాలుగున్నరేళ్ల కాలంలో చేకూరిన సంక్షేమం, అభివృద్ధిపై చర్చ జరిగింది. సీఎం వైఎస్ జగన్‌పాలనలో సుఖ సంతోషాలతో ఉన్నామని చర్చావేదికలో ఆయా వర్గాల వారు వెల్లడించారు. మధ్యాహ్నం 2.20 నుంచి 2.40 గంటల వరకు విలేకరుల సమావేశం నిర్వహించారు. సాయంత్రం 4.16 గంటల సమయంలో ఫంక్షన్‌హాల్ నుంచి స్థానిక పెట్రోల్ బంకు కూడలి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. 4.45 గంటల నుంచి 6.30 గంటల వరకు సభ కొనసాగింది. సభాస్థలి వద్ద మంత్రులు, ప్రజాప్రతినిధులకు బనగానపల్లె జెడ్పీటీసీ సభ్యులు లక్ష్మీసుబ్బమ్మ ఆధ్వర్యంలో అభిమానులు క్రేన్ సాయంతో భారీ పూలమాల వేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు వేదికపైకి చేరుకునే సమయంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డికి జేజేలు పలికారు.



నా మనవడే మళ్లీ సీఎం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటోను చూపుతున్న అవ్వ

ఆకట్టుకున్న నేతల ప్రసంగాలు

సామాజిక బస్సుయాత్రలో పలువురి నేతల ప్రసంగాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసంపై ఎక్కువ శాతం ప్రసంగాలు జరిగాయి. పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేసే సందర్భంగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సామాజిక బస్సుయాత్రలో యువత జోష్ కన్పించింది. పార్టీ జెండాలతో పట్టణంలో చక్కర్లు కొడుతూ ఉత్సాహంగా కన్పించారు.



బైక్ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బీసీ జనార్దన్‌రెడ్డికి పేదలపై ప్రేమ లేదు

పేద ప్రజలపై బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి ప్రేమ లేదని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధ్వజమెత్తారు. సభ నుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో మూడు వేల మంది పేదలకు ఇళ్లస్థలాలు కేటాయిస్తే హైకోర్టు ద్వారా స్టే తెప్పించి బీసీ జనార్దన్‌రెడ్డి అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను రైతులను చేసేందుకు కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో అసైన్‌మెంట్ భూములు పంపిణీ చేసేందుకు 8 వేల ఎకరాలు గుర్తిస్తే అది రాకుండా స్టే ద్వారా అడ్డుకోవడం విచారకరమన్నారు. 2014 ఎన్నికల్లో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. తిరిగి 2024 ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు. బాబుకు షూరిటీ లేదని, లోకేష్‌కు గ్యారెంటీ లేదని, తెలుగుదేశం పార్టీకి వారంటీ లేదని ఎద్దేవా చేశారు.

అన్ని వర్గాలకు అండ



పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. బనగానపల్లె ప్రజలంతా కొన్నేళ్ల నుంచి కాటసాని కుటుంబానికి అండగా ఉన్నారన్నారు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్‌తో పాటు మరెన్నో పథకాలు అమలుపరిచారని, తండ్రి బాటలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి పేరుతో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచారన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వాన్ని, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. ఏ ముఖ్యమంత్రి కూడా వెనుకబడిన కులాలకు ఇంతటి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు.

రూ.23 వేల కోట్లతో మైనార్టీల సంక్షేమం

కొలిమిగుండ్ల/అవుకు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల కాలంతో మైనార్టీల సంక్షేమం కోసం రూ.23 వేల కోట్లు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన హయాంలో కేవలం రూ.2,642 కోట్లు ఖర్చు చేసి, మైనార్టీలకు మోసం చేశారని విమర్శించారు. బనగానపల్లె పట్టణంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రతినిధులతో వివిధ అంశాలపై చర్చావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల, తిరుపతి ఎంపీలు పోచా బ్రహ్మానందరెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్సీ మధుసూదన్‌తో కలసి డిప్యూటీ సీఎం, బనగానపల్లె ఎమ్మెల్యే మాట్లాడారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలకు రాజకీయంగా మంచి గుర్తింపు ఇచ్చిందన్నారు. టీడీపీ హయాంలో నాలుగేళ్ల పాటు ముస్లింలకు ఒక్క మంత్రి పదవి దక్కలేదన్నారు. ఇమాం, మౌజంలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గౌరవవేతనాన్ని అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ షాదీతోఫా కింద ప్రభుత్వం ఇచ్చే లక్ష రూపాయలు చాలా ఊరట కలిగిస్తుందని పలువురు ముస్లిం ప్రతినిధులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. బనగానపల్లె పట్టణంలో ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మైనార్టీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో కాటసాని ఓబుళరెడ్డి, జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షుడు యూనస్, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



చర్చా వేదికకు హాజరైన వివిధ వర్గాల ప్రజలు

అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుస్తున్న జగన్

- విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

కొలిమిగుండ్ల/అవుకు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా బుధవారం పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాజంలో దళితులంటే గతంలో చిన్న చూపు ఉండేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ, రాజ్యాంగ పదవులు దక్కి సమాజంలో గౌరవం పెరిగిందన్నారు. పార్టీలో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,72 లక్షల మంది బీసీలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించే బాధ్యత ప్రభుత్వం తీసుకుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 14 ఏళ్ల పాటు సీఎంగా ఉండి బీసీలకు చేసింది ఏమీ లేదన్నారు. అణగారిన వర్గాల వారిని రాజకీయంగా ఎదగనీయకుండా ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసేవారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని దింపేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కుట్ర పన్నుతున్నారని, ఇది ఎట్టి పరిస్థితుల్లో జరగబోదని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీని చంద్రబాబు తన ఆధీనంలోకి తీసుకున్నారని, దమ్ముంటే సొంతంగా పార్టీ స్థాపించాలని సవాల్ విసిరారు. చంద్రబాబు బెయిల్ పొందేందుకు లాయర్లకు రూ.1,200 కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు.ఎల్లో మీడియా నిరంతరం అవినీతి, అక్రమాలు అంటూ వైఎస్సార్‌సీపీపై బురద జల్లుతోందని, మార్గదర్శిలో పెద్దఎత్తున అక్రమాలు జరిగితే ఎందుకు రాయలేకపోతోందని ప్రశ్నించారు. పేదల తలరాతలు మార్చేలా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని, గతానికి ఇప్పటికీ ఉన్న తేడాను ఒక సారి పరిశీలించుకోవాలని ప్రజలకు సూచించారు. విలేకరుల సమావేశంలో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నంద్యాల, తిరుపతి ఎంపీలు పోచా బ్రహ్మానందరెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్దాం

- టీడీపీ విష ప్రచారాన్ని తిప్పికొడదాం
- 2024లో పెత్తందారులు, పేదల మధ్యే ఎన్నికలు
- మీడియా, సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డి

నంద్యాల(సిటీ): ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లి టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొడదామని వైఎస్సార్‌సీపీ మీడియా, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సజ్జల భార్గవరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం నంద్యాల జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి, వైఎస్సార్సీపీ సోషల్ మీడియా విభాగంలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన వెంకటేశ్వరరెడ్డి, మధు, హేమంత్‌రెడ్డి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. ఈ సందర్భంగా సజ్జల భార్గవరెడ్డి మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్ల కాలంలో దేశమే కాకుండా ప్రపంచమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా విద్య, వైద్య రంగాలతో పాటు అన్ని రంగాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. హామీలన్నింటినీ అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. వచ్చేవి పెత్తందారులు, పేదల మధ్య ఎన్నికలని, పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. కష్టపడితే రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో కచ్చితంగా గెలవవచ్చన్నారు. స్కిల్, ఫైబర్ , లిక్కర్.. తదితర స్కాముల్లో టీడీపీ కూరుకుపోయి ఉందన్నారు. 2014 ఎన్నికల సమయంలో సుమారు 600లకు పైగా హామీలు ఇచ్చి, అమలు చేయకుండా ప్రజల చంద్రబాబు మోసం చేశారని గుర్తు చేశారు. చంద్రబాబుతో కలసి ప్యాకేజీ కోసం కక్కుర్తి పడే పవన్ కళ్యాణ్, ఈనాడు, ఏబీఎన్ లాంటి తోడేళ్ల గ్యాంగ్ వస్తోందని, వైఎస్సార్సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి వాటిని తిప్పికొట్టాలన్నారు.



మాట్లాడుతున్న సజ్జల భార్గవరెడ్డి

➤ వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు అబద్ధాల పుట్ట అని, ఒక తప్పును కప్పి పుచ్చడానికి 10 అబద్ధాలు ఆడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు.

➤ జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాలనను చేరువైందన్నారు. టీడీపీ నాయకుల మాదిరిగా గ్రాఫిక్స్ కోసం కోట్ల రూపాయలను వెచ్చించకుండా సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన అందిస్తున్నారన్నారు.

➤ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు వేషాలు అందరూ గమనిస్తున్నారని, టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు.

➤ నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్‌ను చూస్తే టీడీపీ, జనసేనలకు భయం వేస్తోందన్నారు. దుష్టచతుష్టయంతో సైనికుల్లా పోరాడాలన్నారు. జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు.

➤ ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ.. చంద్రబాబు మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారన్నారు. వారికి పదవులు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నార్త్ అమెరికా అధ్యక్షుడు కె. రత్నాకర్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు శ్వేతా రెడ్డి, ఎపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా

గోస్పాడు: ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీస్ సిబ్బందిని ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరాతీశారు. ముద్దాయిలకు శిక్షపడేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చట్టవ్యతిరేక, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నిందితులను పట్టుకోవడానికి అధునాతన సాంకేతికతను ఉపయోగించుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.గోవిందపల్లె, జిల్లెల్ల గ్రామాల్లో పోలీసు పికెట్‌లను తనిఖీ చేసి సిబ్బందికి కొన్ని సూచనలు ఇచ్చారు.



పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో పీఈటీ కళ్యాణి

పాములపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రత్యేక అధికారిణి రాజ్యలక్ష్మి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ అండర్ 18 విభాగంలో ఇంద్రాణి, అండర్ 16 విభాగంలో తస్నీమ్ ఫాతిమా బేగం, అండర్ 14 విభాగంలో సుమకీర్తిలు ఎంపికయ్యారని వివరించారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల పీఈటీ కళ్యాణి టీం మేనేజర్‌గా ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థినులను, పీఈటీని ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కొండజూటూరులో చోరీ

పాణ్యం : మండల పరిధిలోని కొండజూటూరు గ్రామంలో చోరీ జరిగినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన సుమలతకు చెందిన ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు జొరబడి బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.1లక్ష 50వేల నగదు దొంగిలించారన్నారు. ఉదయాన్నే బీరువా వద్దకు వెళ్లి చూడగా అందులో ఉన్న నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



పేదింట కల్యాణమస్తు!

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా
- జిల్లాలో 446 మంది అమ్మాయిలకు రూ.3,72,80,000
- ముస్లిం మైనార్టీలకు వైఎస్ఆర్ షాది తోఫా... ఇతరులకు వైఎస్సార్ కల్యాణమస్తు
- నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా 4వ విడత 'కల్యాణమస్తు'కు శ్రీకారం



కర్నూలు (అగ్రికల్చర్): పేదింటి మహిళలకు ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫాతో అండగా నిలుస్తోంది. వివాహం ఖరీదైనదిగా మారిన నేపథ్యంలో వారికి ఆర్థికంగా భరోసానిస్తోంది. ఇల్లు కట్టి చూడు... పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. రెండింటిలో ఏదీ చేసినా జేబు ఖాళీ అవ్వాల్సిందే. నేడు వివాహం అంటే రూ.లక్షలతో కూడిన వ్యవహారం. దీంతో ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలు, దివ్యాంగులకు వైఎస్సార్ కల్యాణమస్తు, ముస్లింలకు వైఎస్సార్ షాదీతోఫా పేరుతో ఆర్థిక సాయం చేసి అండగా నిలుస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి ఇప్పటి వరకు మూడు పర్యాయాలు ఆర్థిక సాయం చేసింది. నాలుగో విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం బటన్ నొక్కి మహిళల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా జమ చేయనున్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన వారందరికి కల్యాణమస్తు, షాదీతోఫా కింద ఆర్థిక సాయం అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా స్థాయిలో డీఆర్‌డీఏ–వైకేపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి బటన్ నొక్కి నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించనున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారు.

జిల్లాలో 446 మందికి లబ్ధి

జిల్లాలో కల్యాణమస్తు, షాదీతోఫా కింద ముస్లిం మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాలు, దివ్యాంగుల కుటుంబాలకు చెందిన 446 మహిళలకు ఆర్థిక సాయం అందనుంది. కల్యాణమస్తు, షాదీతోఫా కింద జిల్లాలో రూ.3.72 కోట్లు నేరుగా డీబీటీ ద్వారా మహిళల బ్యాంకు ఖాతాలకు జమ కానుంది. బీసీల్లో 167 జంటలకు, వికలాంగులకు సంబంధించి నాలుగు జంటలకు, ముస్లిం మైనార్టీలకు సంబంధించి 83 జంటలకు, ఎస్సీల్లో 184 జంటలకు, ఎస్టీల్లో 8 జంటలకు ఈ ప్రయోజనం కలగనుంది.

కర్నూలు జిల్లాలో మూడు విడతల్లో లబ్ధిపొందిన వారి వివరాలు

విడత	ప్రయోజనం పొందిన లబ్ధిదారులు	ఆర్థిక సహాయం (రూ.లో)
1వ విడత	271	2,31,40,000
2వ విడత	574	4,26,35,000
3వ విడత	1076	8,61,05,000
4వ విడత	446	3,72,80,000
మొత్తం	2,367	18,91,60,000

పారదర్శకంగా అర్హుల ఎంపిక

కల్యాణమస్తు, షాదీతోఫా పథకానికి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేశాం. అర్హత కలిగిన వారందరికీ న్యాయం చేశాం. జిల్లాలో 446 మంది మహిళలకు అర్హత లభించింది. వీరి బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా రూ.3.72 కోట్ల నగదు జమ కానుంది.

– సలీం బాషా, పీడీ, డీఆర్‌డీఏ–వైకేపీ, కర్నూలు

వ్యవసాయాన్ని పండుగ చేశారు




నాకు రెండు కాడెడ్లు ఉన్నాయి. వాటిని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నా. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకా ప్రతి ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 నా వ్యక్తిగత ఖాతాలో జమవుతోంది. ఇది పెట్టుబడులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మా గ్రామంలో రైతుభరోసా కేంద్రం ఉండటంలో ఎంతో మేలు జరుగుతోంది. గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు ఇస్తున్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాకా నాకు వృద్ధాప్య పింఛన్ కూడా ఇస్తున్నారు. వలంటీర్ ఇంటికి వచ్చి ప్రతి నెలా రూ.2,750 అందిస్తున్నారు. మూడు రోజుల క్రితమే వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.4వేలు నా వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో వేశారు. వ్యవసాయాన్ని పండుగ చేసిన వైఎస్ జగన్ మరోసారి సీఎం కావాలి.



– పుల్లయ్య, క్రిష్టిపాడు, దొర్నిపాడు మండలం

రూ.15 లక్షల ఆస్తి ఇచ్చారు



ఐదేళ్ల నుంచి బాడుగ ఇంట్లో ఉంటున్నాం. నెలకు రూ. 3 వేలు అద్దె చెల్లించేవాళ్లం. రెండు నెలల నుంచి అద్దె బాధతీరింది. జగనన్న కాలనీలో ప్రభుత్వం మాకు స్థలం ఇచ్చింది. ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందించింది. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని రెండు నెలల క్రితమే చేరాం. మొత్తం రూ.15 లక్షల ఆస్తి మాకు దక్కింది. కాలనీలో రోడ్లు వేశారు. పైపులైన్ ద్వారా ఇంటి వద్దకే మంచినీళ్లు వస్తున్నాయి. కరెంట్ బిల్లు తక్కువ వస్తోంది. నెల వచ్చేలోపు ఇంటి బాడుగ చెల్లించాలని బాధ లేదు. చాలా సంతోషంగా ఉన్నాం. జగనన్న రుణం తీర్చుకోలేం.

– సైనాజ్‌బేగం, నందికొట్కూరు పట్టణం

సుదర్శన హోమం.. భక్తి పారవశ్యం


పూర్ణాహుతి చేస్తున్న అహోబిల ఆలయ అర్చకులు


హోమంలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: నృసింహ దాస కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలమూరులో సుదర్శన హోమం నిర్వహించారు. ముందుగా నరసింహస్వామి, సుదర్శన మూర్తి చిత్ర పటాలకు పూజలు చేశారు. పుణ్యాహవచనం అనంతరం రక్షా కంకణాలకు పూజలు చేసి భక్తులకు అందజేశారు. శ్రీసూక్త, పురుషసూక్త సహిత సుదర్శన మంత్ర జప హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాలు ముగియగానే పూర్ణాహుతి గావించారు. ఆయా కార్యక్రమాల్లో అహోబిల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలన్, మధు, సౌమ్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

ప్రాణం తీసిన విద్యుత్ వైర్ల ఉచ్చు

- బుగ్గానిపల్లెలో మేకలకాపరి మృతి


పిట్టల మాదన్న (ఫైల్)

బేతంచెర్ల: అడవి పందుల కోసం పెట్టిన విద్యుత్ వైర్ల ఉచ్చు మేకల కాపరిని బలితీసుకుంది. ఈ దుర్ఘటన బుగ్గానిపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పిట్టల మాదన్న (49) మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం గ్రామ సమీపాన ఉన్న గోధుమారు ఎల్లమ్మ ఆలయం వైపు మేకలను మేపేందుకు వెళ్లాడు. గ్రామానికి చెందిన జయరాముడు, వెంకట్రాముడు, మధు.. అడవి పందుల కోసం విద్యుత్ వైర్లను పంటపొలాల సమీపాన ఉంచారు. సాయంత్రం తిరిగి వచ్చే సమయంలో వాటిని గమనించకుండా పిట్టల మాదన్న విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఉచ్చు ఉంచిన వారు రాత్రి ఈ విషయాన్ని గమనించి, తమపై నేరం పడకుండా మృతదేహాన్ని ముదిగేటమ్మ పొలాల సమీపాన రైల్వే ట్రాక్ పక్కన్న మట్టిలో పూడ్చి వేశారు. మేకలు ఇంటికి వచ్చినా మాదన్న రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. బుధవారం ముదిగేటమ్మ పొలాల పక్కన గుంత ఉండటంతో అనుమానం వచ్చి చూడగా మాదన్న మృతదేహం కనిపించింది. సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఉమ్మడి జిల్లాలో 9 పోలీస్‌స్టేషన్ల స్థాయి పెంపు

కర్నూలు: శాంతి భద్రతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 9 పోలీస్ స్టేషన్లను పూర్తిస్థాయి పోలీస్‌స్టేషన్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో దేవనకొండ, గోనెగండ్ల, ఓర్వకల్లు, కౌతాళం, ఆస్పరి, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, ఆత్మకూరు, కొలిమిగుండ్ల, శ్రీశైలం టూటౌన్ పోలీస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ నం.192 విడుదల చేశారు. ఇకపై సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఆయా స్టేషన్లు కొనసాగనున్నాయి. 9 పోలీస్ స్టేషన్లను పూర్తిస్థాయి పోలీస్‌స్టేషన్లుగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల క్రైం గ్రాఫ్‌ను నియంత్రించడంలో దోహదపడుతుందని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు ఇటీవల సీఐలుగా పదోన్నతి పొంది పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. వారిని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్లకు నియమించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

అయ్యప్ప మాలధారుడి గల్లంతు

పత్తికొండ రూరల్: పత్తికొండ–ఆదోని రోడ్డులోని హంద్రీనీవా కాలువ వద్ద స్నానం చేసేందుకు వెళ్లి కాలువలోకి దిగిన అయ్యప్ప మాలధారుడు బుధవారం రాత్రి గల్లంతయ్యాడు. తమిళనాడు రాష్ట్రం సేలం సమీపంలోని సింగిరి గ్రామానికి చెందిన కార్తీక్ చెన్నై నుంచి బీజాపూర్‌కు పెయింట్ లోడు లారీ డ్రైవర్‌గా బయల్దేరాడు. మాలధారుడు కావడంతో పత్తికొండ సమీపంలోని హంద్రీనీవా కాలువలోకి స్నానానికి దిగాడు. నీటి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నా చీకటి పడటంతో సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. క్లీనర్ అరస కుమార్ డ్రైవర్ వివరాలు విలేకరులకు తెలిపాడు.

27న 'సామూహిక ఒడిబియ్యం'


ఒడిబియ్యం సామగ్రితో సంతాన పూజ చేస్తున్న అర్చకులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27న సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అర్చకులు నారాయణస్వామి, సురేష్ స్వామి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ సంతానం లేని వివాహితులకు సంతాన సాఫల్యుడిగా పేరు గాంచిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి సన్నిధిలోసామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రెండు వేలకు పైగా వివాహితులు హాజరయ్యే అవకాశముందని అంచనా వేసి ఆమేరకు చీరె, జాకెట్, పసుపు, కుంకుమతో పాటు ఒడి బియ్యం సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు కిట్టయ్య, శరభయ్య పాల్గొన్నారు.

25న నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పరిధిలోని నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్య నిర్వాహకులు నాగపుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని త్యాగరాజ స్వామి దేవస్థానం ఆవరణలో కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలోనే 2022–23 విద్యాసంవత్సరంలో అత్యంత ప్రతిభ కనపరిచి పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు.. జేఈఈ, నీట్, సీఏ ప్రవేశ పరీక్ష లో అర్హత సాధించిన నాయిబ్రాహ్మణ విద్యార్థు లకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నా రు.వివరాలకు 70138 56031, 94900 11585 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

కేసీలో విద్యార్థి గల్లంతు


దేవేంద్ర(ఫైల్)

పగిడ్యాల: ముచ్చుమర్రి క్రాస్ రెగ్యులేటర్ల వద్ద కేసీ కాలువలో బుధవారం బాబాయ్‌లతో కలిసి ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చెందిన కళ్యాణి, కృష్ణ దంపతుల కుమారుడు సూర్యం దేవేంద్ర(13) ఆత్మకూరు పట్టణంలోని కప్పలకుంట హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. అవ్వతాతల వద్ద ఉండి చదువుకుంటున్న దేవేంద్ర కొద్ది రోజుల క్రితం తల్లిదండ్రులను చూసేందుకు కొత్త ముచ్చుమర్రికి వచ్చాడు. సాయంత్రం బాబాయ్‌లతో కలిసి కేసీ కాలువకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ అందులో పడి గల్లంతయ్యాడు. పోలీసుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

శ్రీ భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం,
శ్రీశైలం - 518101, నంద్యాల జిల్లా
ఇ-ప్రొక్యూర్మెంట్ -కం-బహిరంగ వేలం ప్రకటన
ఆర్.సి.నెం. సి2/4703/2023, తేది: 16.11.2023

శ్రీశైల దేవస్థానం హక్కు భుక్తములలోని ఈ క్రింద తెలిపిన ఐటములకు లీజుహక్కులు మంజూరు కొరకు తేది. 06.12.2023న ఉదయం గం. 11-00ల నుండి పరిపాలన భవనము నందు బహిరంగ వేలం నిర్వహించబడును.

క్ర. సం.	వివరములు	కొలతలు	లీజుకాలము	ధరావత్తు రూ.	అప్‌సెట్ ప్రైజ్ నెల ఒక్కింటికి రూ.
I	శ్రీశైలం నందు				
1	టూరిస్టు బస్టాండు వద్ద ఖాళీ స్థలము	10'x20'	01.02.2024 నుండి 31.01.2027 వరకు	1,00,000/-	14,500/-
2	టూరిస్టు బస్టాండు వద్ద ఖాళీ స్థలము	10'x20'	01.12.2023 నుండి 30.11.2026 వరకు	1,00,000/-	6,000/-
3	డార్మిటరీ వద్ద ఖాళీ స్థలము	10'x10'	...do...	50,000/-	7,000/-
4	డార్మిటరీ వద్ద ఖాళీ స్థలము	10'x10'	...do...	50,000/-	7,000/-
5	మానిక్యేశ్వరి మాత ఆశ్రమం ఎదురుగా ఖాళీ స్థలము	10'x10'	...do...	50,000/-	7,000/-
II	శిఖరం వద్ద				
6	ఖాళీ స్థలము 1 షాపు నిర్వహణ లీజు హక్కులు	10'x15'	01.02.2024 నుండి 31.01.2027 వరకు	50,000/-	8,500/-
7	ఖాళీ స్థలము 2 షాపు నిర్వహణ లీజు హక్కులు	10'x15'	...do...	50,000/-	6,500/-
8	షాపు నం.1	10'x10'	01.12.2023 నుండి 30.11.2026 వరకు	50,000/-	17,000/-
9	షాపు నం.2	10'x10'	...do...	50,000/-	11,500/-
10	షాపు నం.3	10'x10'	...do...	50,000/-	9,000/-
11	షాపు నం.4 (భక్తుల పాదరక్షలు భద్రపరచుకొని తగు రుసుము వసూలు చేసుకొను లైసెన్సు హక్కు)	10'x10'	...do...	50,000/-	16,000/-
12	మహాశివరాత్రి-2023 సందర్భముగా శివదీక్షా భక్తులచే సమర్పించబడిన ఎండుకొబ్బరి (4వ పర్యాయం బహిరంగ వేలం మాత్రమే)	పరిమాణం సుమారు 4500 కేజీలు	....	20,000/-	80/- 1 KG

ఆసక్తి గల వారు శ్రీయుత కార్యనిర్వహణాధికారి, శ్రీశైల దేవస్థానం పేరున ధరావత్తుగా డి.డి. 3 పోస్టు డేటెడ్ చెక్కులు మరియు గుర్తింపు కార్డు సమర్పించి పాల్గొనవచ్చును. ఇ-ప్రొక్యూర్మెంట్ నందు పాల్గొనుటకు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in ను సందర్శించి పాల్గొనవచ్చును.

ఇతర వివరముల కొరకు దేవస్థానం కార్యాలయ పనివేళలలో సెల్ 9440533620, 9440322346 & 9966390011ను సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- డి.పెద్దిరాజు, డిప్యూటి కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి.